క్లుప్తంగా

ఆలయం వద్ద భక్తుల సందడి


రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

కనగల్ : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. మహిళా భక్తులు కుంకుమ, అభిషేక పూజలు నిర్వహించి అమ్మవారికి చీర సారె ఒడి బియ్యం బోనంతో నైవేద్యాలను సమర్పించారు.

మల్లయాచారికి జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న మల్లయాచారి

చండూరు : మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన డాక్టర్ బొడ్డోజు మల్లయాచారికి విశ్వకర్మ విద్యావిభూషణ్ జాతీయ అవార్డు వరించింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ మల్లయాచారి విద్యారంగంలో చేసిన సేవలకు ఈ అవార్డు దక్కింది. శ్రీ విరాట్ విశ్వకర్మ మహోయజ్ఞోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఈ అవార్డు ప్రదానం చేసింది.

బాలికల హాస్టల్‌లో రాత్రి నిద్ర


విద్యార్థినులతో కలిసి హాస్టల్‌లో నిద్రిస్తున్న హాస్టల్ ఇన్‌చార్జ్ భారతమ్మ

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని ఎస్సీసీడీ బాలికల బీ హాస్టల్‌లో మంగళవారం హాస్టల్ ఇన్‌చార్జ్ దూసరి భారతమ్మ బాలికలతో కలిసి రాత్రి నిద్ర చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

నాంపల్లి: లేబర్ కోడ్స్ రద్దు కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం నాంపల్లిలో రేవెల్లి యాదయ్య అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాంపల్లి శ్రీనివాస్, బుడిగ యాదగిరి, ఎదుల సునీత, కోరే లలిత, శంకరమ్మ, నాంపల్లి నరేష్, గాదెపాక మరియమ్మ, అబ్బనబోయిన వెంకటయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన యర్కల దుర్గమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి దుర్గమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, యర్కల రవికుమార్, యర్కల శ్రీనివాస్, మిట్టపల్లి శివ, రెడ్డిపల్లి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

మర్రిగూడ : దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలోని 88 మంది విద్యార్థులకు సుమారు రూ.15వేల విలువ గల టై, బెల్టులు, ఐడీ కార్డులు, బ్యాడ్జీలను మంగళవారం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్ కస్తూరి సహకారంతో ఫౌండేషన్ సభ్యుడు కార్తీక్‌గౌడ్ అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు కార్తీక్‌గౌడ్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మల్లమ్మ, ఉపాధ్యాయులు వై.మంజులత, కొండ శ్రీనివాస్, సబావత్ వెంకట్‌కుమార్, మీనా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు విస్తరణకు మోక్షం

- మొదలైన నకిరేకల్-కడపర్తి రోడ్డు విస్తరణ పనులు
- చెట్ల తొలగింపు పనులు ప్రారంభం
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు


నకిరేకల్ మార్కెట్ రోడ్డులో తొలగించిన చెట్లు


రద్దీగా ఉన్న నకిరేకల్ మార్కెట్ రోడ్డు

నకిరేకల్ : ఎట్టకేలకు నకిరేకల్ పట్టణంలోని మార్కెట్-కడపర్తి రోడ్డు విస్తరణకు మార్గం సుగమం అయింది. ఇరుకు రోడ్డుతో వాహనాల రాకపోకలతో దుమ్ము ధూళితో ప్రజలు, దుకాణదారులు ఏళ్లుగా ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనుల జాప్యంపై గతంలో పలుమార్లు సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. మూడు మాసాల క్రితం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆర్‌అండ్‌బీ నల్లగొండ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ సంతోష్, శ్రీకాంత్, విద్యుత్ శాఖ అధికారులు కలిసి మార్కెట్ రోడ్డును పరిశీలించారు. పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు.

రూ.10 కోట్ల నిధులు మంజూరు

రోడ్డుకు ఇరువైపులా పెద్ద వృక్షాలు, విద్యుత్ స్తంభాలు ఉండడంతో సంబంధిత అధికారులు ఆయా శాఖల అనుమతి కోసం లేఖ పంపారు. అటవీ శాఖ అనుమతులు లభించడంతో రెండు రోజులుగా పన్నాలగూడెం చౌరస్తా నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద వేప చెట్ల తొలగింపు పనులు మొదలుపెట్టారు. చెట్లను తొలగించాక విద్యుత్ స్తంభాల లైను మార్పిడి పనులు చేపడతారు. ఈ రెండు పనులు పూర్తయిన తరువాత రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేందుకు చర్యలు ముమ్మరంగా చేస్తున్నారు. ప్రస్తుతం రూ.10 కోట్ల నిధులు మంజూరైనందున వాటితో ఒక కిలోమీటర్ మేర పన్నాలగూడం చౌరస్తా నుంచి వైఎస్సార్ కాలనీ వరకు రోడ్డు విస్తరణ చేయనున్నారు. 72 ఫీట్ల వెడల్పుతో విస్తరణ పనులు చేపట్టనున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్‌ను అమర్చనున్నారు.

గత ఏడాదే మంజూరైనా..

నకిరేకల్‌లోని మార్కెట్ రోడ్డు విస్తరణ, సిరాంచ హైవే నుంచి కడపర్తి వరకు రోడ్డు మరమ్మతుల కోసం స్టేట్ ప్లాన్ నుంచి రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు 2024 మార్చి 13వ తేదీన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. నిధులు పూర్తిస్థాయిలో సరిపోనందున పనుల్లో జాప్యం జరిగింది. మరో రూ.8 కోట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మిగతా నిధులు మంజూరైతే వైఎస్సార్ కాలనీ నుంచి సిరాంచ హైవే చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పూర్తి చేయనున్నారు.

20 గ్రామాల ప్రజల రాకపోకలు..

రెండు మండలాలు, రెండు నియోజకవర్గాలను కలిపే నకిరేకల్-కడపర్తి రహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. నకిరేకల్ నుంచి శాలిగౌరారం మండలం వైపు వెళ్లే ఈ ప్రధాన రహదారిలో 20 గ్రామాలకు చెందిన దాదాపు 10 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. 200 దాకా ఆటోలు ద్విచక్ర వాహనాలు, బస్సులు నిరంతరం తిరుగుతుంటాయి. నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం మూలమలుపు నుంచి శాలిగౌరారం మండలానికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా పన్నాలగూడెం నుంచి నకిరేకల్ శివారులోని సిరాంచ బైపాస్ వరకు ఉన్న మూడు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతోపాటు రోడ్డు వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డు సింగిల్ రోడ్డుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి నిత్యం ఈదారి గుండా శాలిగౌరారం, మోత్కూర్, అడ్డగూడూరు, నార్కట్‌పల్లి మండలాల వైపు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, వాహనదారులు కూడా నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.

చిరకాల కల నెరవేరబోతోంది



నకిరేకల్ పట్టణంలోని 1, 9వ వార్డుల మీదుగా వెళుతున్న మార్కెట్-కడపర్తి రోడ్డు విస్తరణతో మా చిరకాల కల నెరవేరబోతోంది. మూడు కిలోమీటర్ల మేర రహదారి గుంతలమయంగా మారిన నేపథ్యంలో ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవ చూపి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించారు.

– కందాల భిక్షంరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్, నకిరేకల్

ఎదుళ్ల రిజర్వాయర్ వద్ద ఎఫ్‌ఎల్‌ఎస్ పెంచొద్దు

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్: శివన్నగూడెం ప్రాజెక్టుకు నీరందించే ఎదుళ్ల రిజర్వాయర్ వద్ద ఎఫ్‌ఎల్‌ఎస్(ఫుల్ లెవల్ సప్లయ్)ను పెంచకుండా చూడాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం ప్రాజెక్టుకు నీటిని తీసుకొచ్చేందుకు రూ.1,800 కోట్ల నిధులతో పరిపాలనా అనుమతులు సాధించినట్టు గుర్తుచేశారు. శివన్నగూడెం రిజర్వాయర్ ద్వారా చౌటుప్పల్, నారాయణపురం మండలాలతోపాటు దండుమల్కాపురం గ్రామంలోని ఇండస్ట్రీయల్ పార్క్‌కు సైతం తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. శివన్నగూడెం రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనుల కోసం సర్వే నిర్వహించి డీపీఆర్ సిద్ధ చేయాలని సూచించారు.

వైద్యశాల పనులు త్వరగా పూర్తి చేయండి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


వంద పడకల ఆస్పత్రి మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : పట్టణంలో వంద పడకల వైద్యశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిని పూర్తి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. నకిరేకల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల వైద్యశాల భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. 96 శాతం మేర పనులు పూర్తయినందున మిగతా పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట నకిరేకల్ మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, పన్నాల రాఘవరెడ్డి, చౌగోని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రతి బిడ్డకు పోషణతోపాటు విద్య అవసరం


నల్లగొండ: మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మల

నల్లగొండ: పుట్టిన ప్రతి బిడ్డకు పోషణతోపాటు విద్య అవసరమని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. పోషణ్ బీ - పడాయి బీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 3 నుంచి 6 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ మంచి పౌష్టికాహారం అందించడంతోపాటు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, సూపర్‌వైజర్లు పార్వతి, జయమ్మ, మల్లేశ్వరి, లక్ష్మమ్మ, మంజుల, శ్రీలత, పద్మ, సరస్వతి, ప్రణీత, వినోదకుమారి, స్వరూప పాల్గొన్నారు.

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

నకిరేకల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న వనరులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి అస్రా అంజుమ్ కోరారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి మంగళవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భవాని, సునీత, సరిత, శారద, కళావతి, అంజమ్మ, జ్యోతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతి చిన్నారికి అందించాలని చండూరు ఆర్‌డీఓ శ్రీదేవి సూచించారు. మునుగోడు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సీడీపీఓ లావణ్య, ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది


మునుగోడు : సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అధికారులు, యూనియన్ నాయకులు

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసిందన్నారు. ఎంఈఓ సైదులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాదురి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, ఎంపీడీఓ జ్యోతి లక్ష్మీ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మల్లయ్య, మధు, లగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లో బల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేష్ ప్రతినిధి పల్‌రెడ్డి రాంరెడ్డి, కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోనారెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చింతల సుధీర్‌కుమార్ జిల్లా ఉత్తమ టీచర్‌గా, మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆంగ్ల ఉపాధ్యాయుడు సింగనబోయిన పండరి ఇటీవల ఎన్నికయ్యారు. కాగా మంగళవారం ఆ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మైనం శ్రీలత, ఉపాధ్యాయులు విశ్వనాథుల రాఘవాచారి, బెల్లి ఆంజనేయులు, తాడిశెట్టి శ్రీనివాసులు, అలీం ఆలం, గోరంట్ల విజయరాణి, బజ్జూరు మంగమ్మ పాల్గొన్నారు. అదేవిధంగా ఇటీవల పరడ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు కళావతి.. పరడ ఉన్నత, ప్రాథమిక, ఎస్టీ కాలనీ పాఠశాలల విద్యార్థులకు బెల్టులు, ఐడీ కార్డులను బహూకరించారు. హెచ్‌ఎం మాలీ జగన్‌మోహన్, అనుముల వాణి, నజీరుద్దీన్, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, సరస్వతి, ప్రతాప్, పెండెం శ్రీనివాసులు పాల్గొన్నారు.

మునుగోడులో..

మునుగోడు: మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సోమవారం మునుగోడు ఎంపీడీఓ కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఎంపీడీఓ యుగేందర్ రెడ్డి, ఎంఈఓ మల్లేష్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శాలిగౌరారం : ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ చామల


కట్టంగూర్ : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం శ్రీలత

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఉద్యమిద్దాం

రామగిరి(నల్లగొండ): ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల విధానంలో మార్పులు జరిగేలా ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఉద్యమించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నల్లగొండ డిపో గౌరవ అధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య అన్నారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నల్లగొండ డిపోలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ రీజియన్ అధ్యక్షుడు కందుల నరసింహ, ఉపాధ్యక్షుడు ఎం సి.మౌళి, సహాయ కార్యదర్శి కె.శ్యాంసుందర్, డిపో కార్యదర్శి ఎస్‌కె.గులాం రసూల్, కార్మికులు భిక్షం, నాగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి'

కనగల్ : తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు పర్వనబోయిన భిక్షం అన్నారు. మంగళవారం కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ విమోచన దినోత్సవం పేరును స్వార్థంతో ప్రజా పాలన దినోత్సవం అని పెట్టి సెప్టెంబర్ 17న కార్యక్రమాలు చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నడూ లేనివిధంగా కొత్త పేరుతో సెప్టెంబర్ 17ను నిర్వహించడం రాష్ట్రానికి చేసే ద్రోహంగా తెలంగాణ ప్రజలు భావిస్తున్నారన్నారు.

పాత అలైన్‌మెంట్ అమలు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మర్రిగూడ : ప్రభుత్వం ప్రతిపాదించిన రీజనల్ రింగ్‌రోడ్డు తమ వ్యవసాయ భూముల మీదుగా వెళ్తోందని, కొత్త అలైన్‌మెంట్‌ను రద్దు చేసి, పాత అలైన్‌మెంట్‌ను అమలు చేయాలని కోరుతూ మర్రిగూడ మండలంలోని దామెరభీమనపల్లి గ్రామ భూ బాధితులు మంగళవారం మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నామని, తమకు వ్యవసాయం తప్ప మరొక పని తెలియదన్నారు. సారవంతమైన వ్యవసాయ భూమిని రింగ్ రోడ్డు కోసం వదులుకోవడానికి సిద్ధంగా లేమన్నారు. వినతిపత్రం అందించినవారిలో జిల్లా కిశోర్, నారెడ్డి రఘుమారెడ్డి, వస్పరి లింగయ్య, శ్రీకాంత్, నీల నర్సింహ, నాగేష్, నీల దేవేందర్, కాస వెంకటయ్య, సత్తయ్య, తుప్పల లింగయ్య, సహదేవ్, చిలివేరు లింగయ్య, ఎల్లపల్లి నరేష్ ఉన్నారు.

భూముల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు


మొక్కకు నీళ్లు పోస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

చిట్యాల: ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి హెచ్చరించారు. చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామంలో సర్వే నంబర్ 20, 61లలో ఇటీవల కొందరు ఆక్రమించడానికి ప్రయత్నించిన ప్రభుత్వ భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా భూముల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణనాయక్ తదితరులు ఉన్నారు.

నేడు విశ్వకర్మ యజ్ఞం

నల్లగొండ టౌన్ : విశ్వకర్మ యజ్ఞ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల విశ్వబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో విశ్వకర్మ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు కమిటీ గౌరవ అధ్యక్షుడు కాసోజు విశ్వనాథం తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు కూరెళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కాసోజు శంకరాచారి, కోశాధికారి రాగిఫణి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహించొద్దు

మునుగోడు: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంతో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని డీపీఓ, మండల ప్రత్యేక అధికారి వెంకయ్య సూచించారు. సోమవారం మునుగోడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు 24 గంటలు వైద్యశాలలో అందుబాటులో ఉండి రోగులకు అవసరమైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ యుగేంధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి


నివాళులర్పిస్తున్న రచయితలు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బలక్ష్మి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సిలివేరు సాహితి కళాపీఠం అధ్యక్షుడు సిలివేరు లింగమూర్తి, నల్లగొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి. సుధారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ సంగీత అధ్యాపకురాలు గరిమెల్ల శ్వేత చేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో రచయితలు మునాసు వెంకట్, బైరెడ్డి కృష్ణారెడ్డి, కోమటిరెడ్డి బుచ్చి రెడ్డి, డా.సాగర్ల సత్తయ్య, నయమా, దాసోజు శ్రీనివాస్, కుకుడాల గోవర్ధన్, గంగదారి నరసింహ, పందిరి శ్యామ్‌సుందర్, కోమటి మధుసూదన్, ఎర్ర దేవదానం, బ్రహ్మచారి, బాణాల పరిపూర్ణాచారి, దాసరి శ్రీ రాములు పాల్గొన్నారు.

రైతాంగ పోరాట అమరవీరులకు నివాళి

నకిరేకల్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో మంగళవారం అమరవీరులకు సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు ఎరుకలి అంజయ్య, గ్యార సైదులు, లగిశెట్టి శ్రీనివాస్‌లు, దిండుగాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

చిట్యాల: భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో నేటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి పిలుపునిచ్చారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో మంగళవారం పీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వరికల్ గోపాల్, ఉయ్యాల లింగస్వామిగౌడ్, బర్రె సంజీవ, దేశపాక సైదులు, మారయ్య, శంకరయ్య, సాలయ్య, బుచ్చిరాములు, జంగయ్య, మంగమ్మ, మాధవి పాల్గొన్నారు.

రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులది

కనగల్ : రజాకారులను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొలుగురి నరసింహ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పొనుగోడు గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జోగు రంగనాయకులు స్థూపానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, సహాయ కార్యదర్శి దొటి పాండరి, ఎండీ జామియా, కెఎస్ రెడ్డి, జోగు ప్రభాకర్, సురేందర్, రాములు, అండాలు, వెంకన్న, భిక్షం పాల్గొన్నారు.

అమరవీరుల సభను విజయవంతం చేయాలి

కట్టంగూర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరమరణం పొందిన వారికి నివాళులర్పించేందుకు బుధవారం నల్లగొండలో జరిగే సభకు తరలిరావాలని సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు పిలుపునిచ్చారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చెర్వుఅన్నారం గ్రామంలో పసునూరి వెంకట్‌రెడ్డి, ముసుకు వెంకట్‌రెడ్డి, గండమల్ల నర్సింహ, మిట్ట కన్నారెడ్డి, అయిటిపాముల గ్రామానికి చెందిన కొండేటి ప్రతాప్‌రెడ్డి, కొండేటి శ్రీనివాసరెడ్డి, కల్మెరకు చెందిన మిట్ట లింగారెడ్డి, గడ్డం పాపయ్య, నాగిర్ల సత్తయ్య, జౌశాలి కృష్ణయ్యలకు నివాళులర్పించేందుకు నల్లగొండలో జరిగే వీర తెలంగాణ సభకు ప్రజలు తరలిరావాలని కోరారు.


నకిరేకల్ : నోములలో అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


చిట్యాల : మాట్లాడుతున్న వెంకటస్వామి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఏఎంసీ చైర్మన్ మంజుల

కేతేపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్త మంజుల మాధవరెడ్డి అన్నారు. కేతేపల్లి మండల కేంద్రంలోని డీపాల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలుర, బాలికల మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు వి.రఘు, సీహెచ్.అశోక్‌రెడ్డి, పుణ్యవతి, పీడీలు హరిత, నాగయ్య, పీఈటీలు బంటు రవి, మాధవి, సైదులు, మహేష్, సీఆర్పీలు మల్లయ్య, కె.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

నకిరేకల్ : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి గోలి మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ విమోచన కోసం ఎంతో మంది అమరులయ్యారన్నారు. వారి ఆత్మశాంతి కోసం అయినా.. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ దినోత్సవాన్ని అధికారికంగా చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నకిరేకంటి మొగిలయ్య, మండల వెంకన్న, గర్రె మురళీ మోహన్, పబ్బు వెంకన్న, గుడుగుంట్ల సాయన్న, బుడిగె సైదులు, చినేని జాని పాల్గొన్నారు.

పత్తి చేల పరిశీలన

మర్రిగూడ : మండలంలోని ఇందుర్తి గ్రామ పరిధిలోని శివన్నగూడెం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సాహస్ రైతులు తదితరులు ఉన్నారు.

మంత్రికి ఆహ్వానం

కనగల్: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంగళవారం జి.యడవల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కలిశారు. గ్రామంలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే ముత్యాలమ్మ తల్లి పండుగకు హాజరు కావాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కర్నాటి గిరి, కొరివి శంకర్, పర్వనబోయిన రామకృష్ణ, పి సైదులు పాల్గొన్నారు.